క్లుప్తంగా

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్:అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు తహసీల్దార్ నాగరాజును కోరారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సోమవారం అందజేశారు. ఎన్ఎంయూఏ నాయకులు తిప్పేస్వామి, నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో షఫీ, రవినాయక్, జిలాన్, నాగరాజు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం



మాట్లాడుతున్న భూసార పరీక్ష కేంద్రం ఏఓ

వజ్రకరూరు: భూసార పరీక్షలు చేయడం వల్ల రైతులకు ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారి మధుకర్ అన్నారు. సోమవారం స్థానిక ఏడీసీసీ బ్యాంకు లో భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఏఓలు శేఖర్‌రెడ్డి, మధుకర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నాగమణి, సీఈఓ సురేష్‌కుమార్, క్లర్క్ సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాయదుర్గం: రక్తదానం ప్రాణదానంతో సమానమని వైద్యులు మహేశ్‌కుమార్, ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఇన్‌సానియత్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మందికి పైగా దాతలు రక్త దానం చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు వరప్రసాద్, శ్రీనివాసులు, అశ్విని, సురేష్ పాల్గొన్నారు.

'మాటతప్పే నైజం కూటమి నేతలదే'

కళ్యాణదుర్గం రూరల్: మాట తప్పే నైజం కూటమి నేతలకు సాధ్యమని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి గోపాల్, వ్యాకాస జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి మండిపడ్డారు. సోమవారం బ్రహ్మసముద్రం మండలం సీపీఐ సమితి ఆధ్వర్యంలో ఆర్డీఓ వసంత్‌బాబుకు వినతిపత్రం అందించారు. అనంతరం కళ్యాణదుర్గంలో రిలే నిరాహార దీక్ష చేశారు. నియోజవర్గం సహాయ కార్యదర్శి నరసింహులు, పట్టణ కార్యదర్శి ఓంకార్, మండల కార్యదర్శి, ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు తో కలిసి శిబిరంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమిలినేని సురేంద్రబాబు కన్నేపల్లి రోడ్డు నిర్మిస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు. దీంతో పది గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.

బాలికల వికాసానికి తోడ్పాటు అందించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్డీఓ వసంతబాబు, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఉద్యోగులు

కళ్యాణదుర్గం: బాలికల వికాసానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోర వికాసం పేరుతో శిశు సంక్షేమ శాఖ కార్యక్రమంపై సమ్మర్ క్యాంపు నిర్వహణ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జూన్ 10 వరకు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని వారు వివరించారు. రాయదుర్గం, కంబదూరు సీడీపీఓలు పద్మావతి, రాధా, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు



మాట్లాడుతున్న సాకే పురుషోత్తం

ఉరవకొండ: విద్యారంగ సమస్యలపై దశలవారీగా ఉద్యమాలు చేయనున్నట్లు వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సాకే పురుషోత్తం తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో నియోజకవర్గ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, యువనేత ప్రణయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి విద్యారంగం నిర్వీర్యమైందన్నారు. విద్యార్థుల తరఫున పోరాడుతామన్నారు.

పశువుల పాకలు కాదు.. ప్రధాన రహదారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారులు పశువుల పాకలుగా మారాయి. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి పెట్రోల్ బంక్ సర్కిల్, పాత బస్టాండ్ నుంచి మొలకాల్మూరు బస్టాండ్, బళ్లారి బస్టాండ్‌తోపాటు కూరగాయల మార్కెట్‌లో పశువులు రోడ్లపై తిష్టవేస్తున్నాయి. పశువుల యజమానులు పాలు పిండుకొని వాటిని వదిలేస్తుండడంతో అవి రోడ్లపై రోడ్లపై పడి ఉన్న వ్యర్థాలను తింటూ తిరుగుతున్నాయి. రాయదుర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ఆవులు, దూడలు ప్రధాన రహదారులతోపాటు వీధుల్లో తిరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఆవుల యజమానులు వాటిని రోడ్లపై వదలడం సరికాదని వాహనదారులు, స్థానికులు, పాదచారులు అంటున్నారు.



కూరగాయల మార్కెట్‌లో మందలుగా తిష్టవేసిన పశువులు

- పాలు పిండుకొని రోడ్లపై వదిలేస్తున్న వైనం
- రాత్రింబవళ్లు రోడ్లపైనే తిష్టవేస్తున్న పశువులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



బళ్లారి రోడ్డులోని ఓ కాంప్లెక్స్‌లో తిష్టవేసిన పశువులు



ఓబుళాచారి రోడ్డులో పశువుల మంద



పాత బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న పశువులు


రోడ్లపై వదిలేస్తున్నారు..



యజమానులు పశువులను రోడ్లపై వదిలేస్తున్నారు. రోడ్లపై అడ్డంగా తిష్టవేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీనికితోడు మేతలేక ఆవులు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. పశువుల పోషణ చేతకాక రోడ్లపైన వీధుల్లోకి వదలడం సరికాదు. పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి. అధికారులు సహకరిస్తే రైతులకు పశువులను అప్పగిస్తాం.

– ప్రశాంత్‌యాదవ్, రాయదుర్గం గోసంరక్షక దళం అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



పట్టణంలో పశువులు అడ్డదిడ్డంగా సంచరిస్తున్నాయి. వీధుల్లో సైతం పదుల సంఖ్యలో తిరుగుతున్నాయి. వాటికి కనీస ఆహారం, సేద తీరేందుకు స్థలం లేక ఎక్కడబడితే అక్కడే తిష్టవేస్తూ, ప్రమాదాలకు గురవుతున్నాయి. అంతేకాక రోడ్లపై అడ్డదిడ్డంగా తిరుగుతుండడంతో వాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూగజీవాల యజమానులు వాటిని రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకోవాలి.

– దుర్గన్న, సీపీఐ మండల కార్యదర్శి, రాయదుర్గం

యజమానులపై కేసులు పెడతాం



పశువులను రోడ్లపైకి, వీధుల్లో వదలొద్దని పలుమార్లు యజమానులకు నోటీసులు ఇచ్చాం. గతంలోనూ పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చి బళ్లారి రోడ్డులో ఓ ఖాళీ స్థలంలో పశువులను తరలించాం. మళ్లీ సమస్య యధావిధిగానే ఉంది. మరోసారి నోటీసులు ఇస్తాం. మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. స్పందించకపోతే ప్రత్యేక ప్రణాళికతో యజమానులకు చట్టపరంగా ఫైన్ విధించడం లేదా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని గోశాల నిర్వాహకులతో మాట్లాడి తరలించే ఏర్పాట్లు చేయిస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

కళ్లెదుటే మోసం

బ్రహ్మసముద్రం : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మండలంలోని కొందరు డీలర్లు చౌక దుకాణాల్లో యథేచ్ఛగా అక్రమాలు, మోసాలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 33 గ్రామాల్లో దాదాపు 39 రేషన్ షాపులు ఉన్నాయి. మామూలుగా కార్డుదారుడు తెచ్చిన సంచిలో బియ్యం నింపి తూకం వేయాల్సి ఉంది. అయితే డీలర్లు స్కేల్‌పై డబ్బా ఉంచి, అందులో బియ్యం నింపి తూకం వేస్తున్నారు. కొన్ని చోట్ల ఖాళీ గోనె సంచులు ఉంచి తూకం వేస్తున్నారు. ఇలా చేయడంతో 20 కిలోలకు ఒకటి నుంచి రెండు కిలోల మేర కార్డుదారుడికి కోత పడుతుంది. ఇదేమని ప్రశ్నిస్తే 'మీకిష్టమైతే రేషన్ తీసుకోండి..లేదా మానేయడం'అంటూ గద్దిస్తున్నారని కార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కందిపప్పు, ఆయిల్ ఇవ్వలేదు. అర కిలో పంచదార ప్యాకెట్ కేవలం రూ. 17 కు బదులు రూ.20 తీసుకుంటున్నారు.



స్కేల్‌పై గోనె సంచి ఉంచి బియ్యం తూకం వేసిన దృశ్యం

రెమిడియల్ తరగతులపై విద్యార్థుల అనాసక్తి

కూడేరు: రెమిడియల్ తరగతులకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు. సోమవారం జల్లిపల్లి, కూడేరు హైస్కూళ్లలో నిర్వహించిన రెమిడియల్ తరగతులకు 167 మందికి గాను ఆరుగురు హాజరయ్యారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 280 మందికి 95 మందే ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 19 నుంచి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 1 నుంచి రెమిడియల్ తరగతులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహిస్తున్నారు. జల్లిపల్లి హైస్కూల్‌లో (25 మంది), మరుట్ల హైస్కూల్‌లో 28 మంది, కొర్రకోడు హైస్కూల్‌లో 8 మంది,కూడేరు హైస్కూల్లో 74 మంది, కరుట్లపల్లి హై స్కూల్‌లో 22 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కానీ విద్యార్థులు ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ రావడం లేదు.ఫెయిల్ అయిన విద్యార్థులు రెమిడియల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మహమ్మద్ గౌస్ సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంతోపాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ నాగమణి, తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడారు. డిమాండ్ల పరిష్కార ఉద్యమ కార్యాచరణలో భాగంగా 9న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా, 14న విజయవాడలో ధర్నా చౌక్‌లో రాష్ట్ర స్థాయి ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాయదుర్గం, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండల శాఖ నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, తిప్పేస్వామి, రామాంజనేయులు, సిద్దేశ్వర్, జాఫర్, సునీల్, సురేష్, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని నిరసనలు



ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



శెట్టూరులో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ సేవలను పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని మండలంలోని దురదకుంట ఎస్సీకాలనీవాసులు 300 మందితో కలిసి ఎస్సీ సంఘాల నాయకులు సోమవారం నిరసన ర్యాలీ చేశారు. అనంతరం పట్టణంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేశారు. టీసర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సుధీర్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ తాలూకా ఇన్‌చార్జ్ తిమ్మరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలిగొలిమిలో కొవ్వొత్తుల ర్యాలీ

కుందుర్పి: మండలంలోని కలిగొలిమి గ్రామంలో ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచ్ గంగాధర ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఓబన్న, ఓబుళపతి, మారుతి, తులశమ్మ, తుమ్మలమ్మ, నాగరాజు, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని వినతి

శెట్టూరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు వినతిపత్రం అందించారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, సర్పంచ్ కుమార్, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం నాయకులు, బోయ తిప్పేస్వామి, చెర్లోపల్లి ప్రకాష్, నాయకులు పోస్ట్ రామకృష్ణ, టైలర్ వన్నూరుస్వామి, ఆదిశేషు, శీనా, మారెన్న, ఆర్డీటీ టీచర్ వన్నూరుస్వామి, బొగ్గుల సురేష్, లింగమయ్య, తిప్పేస్వామి, నాగభూషణం, మోహన్, రమేష్, ఈరన్న, పాలక్షి, రాజన్న, ఆనంద్ మైలారప్ప, మహిళలు పాల్గొన్నారు.

వజ్రకరూరులో..

వజ్రకరూరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కేశవరెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం నాయకుడు గుడిసి రవీంద్ర మాట్లాడుతూ ఆర్డీటీ అనేక ఏళ్లుగా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సునీల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

- జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే మెట్టు



మాజీ ఎమ్మెల్యే మెట్టు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న అనుబంధ విభాగాల అధ్యక్షులు

రాయదుర్గం: స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి సూచించారు. సోమవారం రాయదుర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో అనుబంధ కమిటీల అధ్యక్షులతో కలసి అనంతను తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం రాయదుర్గంలో జరిగే పార్టీ కార్యాకలాపాలపై మెట్టుతో అనంత చర్చించారు. సంస్థాగతంగా బూత్‌స్థాయి వరకు అనుభంద కమిటీలు క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలన్నారు. అన్ని విభాగాలకు కమిటీలు పూర్తయ్యాక రాయదుర్గంలో అందరితోనూ పెద్ద సమావేశం నిర్వహిస్తామని మెట్టు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా ఇటీవల కొన్ని కేసులు నమోదయ్యాయని, ఇక మీదట కొనసాగిస్తే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. సూపర్ సిక్స్ ఇవ్వలేక కూటమి ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. మెట్టు వెంట చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరాళ్ల శివ, డి హీరేహాళ్ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ సందీప్ పాటిల్, తాలూక బూత్ కన్వీనర్ ఆంజిరెడ్డి, మైనార్టీ నాయకులు రహంతుల్లా, నాయకులు మంజునాథ, ఈశ్వరగౌడ, జయరామిరెడ్డి, కళ్యం చిత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఆలయ హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ కాను కల లెక్కింపు మంగళవారం ఉంటుందని ఈఓ సాకే రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. లెక్కింపులో పాల్గొనేవారు సంప్రదాయ దుస్తులైన తెల్ల పంచె, కండువా మాత్రమే ధరించి, రావాలని తెలియజేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి వినతిని పరిష్కరించాలని ఆర్డీఓ వసంతబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యలను స్వీకరించారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుమ్మఘట్ట: అడగుప్ప గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు.

మజ్జిగ పంపిణీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ వేసవి కావడంతో ప్రతి సోమవారం కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి మల్లికార్జున, సర్పంచ్ పరమేశ్వర, జగనాథ్‌రెడ్డి, డీటీ శ్యామ్, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ ఐక్యత ర్యాలీ

రాయదుర్గంటౌన్: పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ రాయదుర్గంలో మాజీ సైనిక ఉద్యోగులు, విశ్వ హిందూ పరిషత్, సనాతన హిందూ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఐక్యత ర్యాలీ నిర్వహించారు. స్థానిక వినాయక సర్కిల్ నుంచి పాతబస్టాండ్, అనంతపురం రహదారి, లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు మీదుగా కళాశాల మైదానం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులు అంజన్‌కుమార్, ఏవీఎస్ రెడ్డి, వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్, సత్యనారాయణ, మల్లికార్జున, సనాతన హిందూ సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి నాగరాజు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నీటి గుంతల వద్దకు వెళ్లొద్దు

శెట్టూరు: ఈత కోసమని నీటి గుంతల వద్దకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దని ఎంఈఓ శ్రీధర్ అవగాహన కల్పించారు. సోమవారం విధులకు వెళ్తున్న ఎంఈఓకు యాటకల్లు వద్ద రోడ్డుపై కొందరు విద్యార్థులు కనించారు. అక్కడ వారితో మాట్లాడారు. ఈత రాకుండా నీటి కుంటల్లో దిగితే ప్రమాదమని తెలియజేశారు. సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంఈఓ సూచించారు.

సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాలు

కూడేరు: సబ్సిడీతో అందించే వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయకుమార్ తెలిపారు. ప్రభుత్వం తరఫున సబ్సిడీతో మండలానికి మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను సోమవారం ఆయన రైతులకు అందించారు. ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పలు రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులు సబ్సిడీతో పరికరాలను అందజేయాలన్నారు. ప్రభుత్వం, ఆగ్రోస్ సంస్థ ఆధ్వర్యంలో మండలానికి రూ.5 లక్షల విలువైన 9 గుంటకలు, గొర్లు, 5 బోద గుంటకలు, నాగళ్లు, హోండా కంపెనీ స్ప్రేయర్లు సబ్సిడీతో మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణాలు మంజూరు

వజ్రకరూరు: కొనకొండ్ల కెనరా బ్యాంకు పరిధిలోని అర్హులైన ప్రతి రైతుకూ రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకు మేనేజర్ బి.బాలాజీ వెల్లడించారు. సోమవారం కొనకొండ్ల కెనరా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో మొత్తం 4వేల మంది రైతులు ఉన్నట్లు తెలిపారు. ప్పటివరకు 500 మంది రైతులు క్రాప్ రుణాలను రెన్యువల్ చే సుకున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

వజ్రకరూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు కోనాపురం ఎర్రిస్వామి, విశ్రాంత ఉద్యోగి బ్యాంకు నాగన్న, అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత బెంజ్‌మెన్, జిల్లా నాయకుడు సుకుమార్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు.

అంధకారం



అంధకారంలో ఉన్న బూదగవి ఎస్సీ కాలనీ

ఉరవకొండ రూరల్: మండలంలోని బూదగవి ఎస్సీ కాలనీలో వారం రోజులుగా అంధకారం అలుముకుంది. కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు నోచుకోకపోవడంతో విద్యుత్ సరఫరా లేదు.ఈ విషయంపై కాలనీవాసులు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోలేదని, చీకట్లో ఉండాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తాం



తలారి రంగయ్యను సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలోనూ మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామక్కపల్లి మల్లి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రచార విభాగ పధాన కార్యదర్శి కొండాపురం నారాయణ తెలిపారు. సోమవారం అనంతపురంలోని పీఏసీ సభ్యుడు, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ స్థితిగతులను చర్చించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న, కన్వీనర్ చంద్రశేఖర్ పరందామరెడ్డి, అక్కులప్ప పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె



మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్పకు సమ్మె నోటీసు అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డిలకు సమ్మె నోటీసు అందజేశారు. దేశంలోని మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ సమ్మెను చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ మేనేజర్‌గా కిశోర్‌బాబు

రాయదుర్గంటౌన్: మున్సిపల్ మేనేజర్‌గా రాయదుర్గానికి చెందిన ఆర్‌కే కిశోర్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. చాలా కాలంగా మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కిశోర్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్పను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న మరో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు సత్యనారాయణ, వెంకటరమణ, చంద్రమౌళి కూడా పదోన్నతులపై మేనేజర్లుగా బదిలీ అయ్యారు.

వడ్డీ రాయితీ మంజూరు

వజ్రకరూరు: వజ్రకరూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు 2021-22, 2022-23 సంవత్సరాలకు మూడు శాతం వడ్డీ రాయితీ రూ.17 లక్షలు మంజూరయినట్లు పీఏసీఎస్ సీఈఓ సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఏడీసీసీ కార్యాలయంలో సీఈఓ సురేష్‌కుమార్ మాట్లాడారు. వజ్రకరూరు పీఏసీఎస్ పరిధిలో మొత్తం 3165 మంది రైతులున్నారని, ఇప్పటి వరకు 850 మంది రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకున్నారన్నారు.